శివశంకరుడు అస్తమించాడు!

స్వామీ శివానంద ఉద్భవించాడు!

# కైవల్యపథం

పరంధామయ్యగారి ఇల్లు ప్రతినిత్యం పెళ్ళివారి ఇల్లులాగా కళకళలాడుతూ వుంటుంది. ఆ పేటకు-ఆ వాడకు ఆ ఇల్లు, ఆ కుటుంబం మహా సందడి.

గలగలా గోదావరిలాంటి నవ్వు వినిపిస్తుంది. అగ్నిపర్వతాలు పేలినంత గందరగోళం, పెనుతుఫానులాంటి అల్లకల్లోలం, అన్నీ ఒంటరిగా, జంటగా, ఒక్కొక్కసారి మూకవుమ్మడిగా ఆ ఇంట్లోంచి వినిపిస్తూ వుంటాయి.

క్షణం తీరికలేని వ్యాపకాలు అందరికి, మనస్సులు, మమతలు కలిసినా మాట పొసగని కుటుంబం అది.

అందరిని కనిపెట్టి చూసేవాడు - ఆర్చేవాడు - తీర్చేవాడు-అందరికి ఐనవాడు-తనని ఎవ్వరు పట్టించుకోనివాడు.

ఇంటికి పెద్ద దిక్కు అయినా తనకు ఏ దిక్కూ లేనివాడు - ఎవ్వరి అండ లేనివాడు.

ఏనాడో చేసిన ఉద్యోగం తాలూకు పెన్షను వస్తోంది కాబట్టి సరిపోయింది-లేకపోతే...

ఊరు పొమ్మనేది - కాడు రమ్మనేది.

పాత్ర పూర్తి అయిన నటుడిలాగా - టికెట్టు కొనుక్కుని రైలు ఎప్పుడు వస్తుందో తెలీని ప్రయాణీకుడిలాగా ఒంటరిగా మిగిలిపోయాడు.

బ్రహ్మ ముహూర్తంలో స్నానం సంధ్య పూర్తిచేసుకుని ఉదయించే సూర్యుడికి అర్ఘ్యం ఇస్తూ స్వాగతం పలికే అలవాటుకు ఒకేఒక వాక్యంతో భరతవాక్యం పలికింది.

పనిపాట లేనివారికి ప్రొద్దున్నే స్నానానికి తొందరేమిటి? స్కూలుకు వెళ్ళవలసినవాళ్ళకు, ఆఫీసుకు వెళ్ళేవారి పనులు అయిన తరువాత మీరు స్నానం చెయ్యండి అని కోడలి సలహా.

ఇంటిపట్టున కూర్చుని-మౌనంగా జపం చేసుకుందామంటే - ఆసన శుద్ధి లేదు...మనస్సులో ఏకాగ్రత లేదు.

"ఎప్పుడూ ఇల్లుపట్టుకుని వేళ్ళాడకపోతే - అట్లా నాలుగు బజార్లు తిరిగి రారాదు' ' అని ఇల్లాలి సూచన...

"మీకు బి.పి. ఉంది... గుండె కూడా బలహీనంగా ఉంది...టిఫిను తిని ఉదయం ఎనిమిది గంటలకు ఈ మందు వేసుకొండి" అని డాక్టరు సలహా. స్నానం సంధ్య పూర్తికానిదే తను పచ్చిగంగ కూడా ముట్టడు. ఉదయ సంధ్యకు ఆస్కారం లేదు. ఇంట్లో ప్రొద్దున్న టిఫిన్ చేయ్యరు అని తెలిసికూడా - ప్రాణంమీద తీపికొద్ది ఒకరోజు అడిగాడు మనుమడిని -

'ఒరేయి శివుడు-వేడి వేడి టిఫిను తెచ్చి పెట్టరా'

"సారీ తాతయ్యా! టీవీలో మంచి ప్రోగ్రాం వస్తోంది, అది పూర్తి అయి-బయటకు వెడితే తెస్తాలే"అని సమాధానం.

ఇంక ఎల్లాగూ రెండు గంటలలో వంట పూర్తి అవుతుందికదా, వేళకానివేళలో టిఫిను ఎందుకు అని ఇల్లాలి ప్రశ్న. 'చిరుతిండి తింటే మీకు పడదు అని డాక్టరుగారు చెప్పలేదా, జిహ్వాచాపల్యం చంపుకోవాలి' అంటూ ఆఖరి కోడలు మందలింపులాంటి సలహా.

"సుందరీ, నువ్వు కాలేజీకి వెళ్ళేటప్పుడు మన డాక్టరుగారిని ఒకసారి రమ్మని చెప్పు' ' అని మనుమరాలితో చెబితే అది సమాధానం చెప్పే లోపలే...

శుభ్రంగా ఆరోగ్యంగా ఉన్నారు, పనిపాటు లేకుండా ఇప్పుడు డాక్టరు దేనికి, రేపో ఎల్లుండో నేనటువైపు వెడితే వీలుంటే డాక్టరుగారిని ఒకసారి రమ్మంటాను అని సుపుత్రుడి సమాధానం.

ఈ తంతు దాదాపు ప్రతినిత్యం ఉండవలసిందే, టిఫిను రాదు, డాక్టరుగారికి కబురు వెళ్ళదు.

ఆరోజు ఉదయం నుంచి ఒంట్లో నలతగా ఉంది - మనసు ఉక్కిరి బిక్కిరిగా ఉంది. ఊపిరి పీల్చడానికి ఇబ్బందిగా ఉంది. గుండెలు ఎవ్వరో పట్టుకుని పిండేస్తున్నారు. కలుక్కుమనే నెప్పి.

మామూలు అభ్యర్ధనలే ... మామూలు సమాధానాలే. ఇంటినిండా వాహనాలున్నాయి... కాని సారధులకే తీరిక లేదు.

ఒంటరిగానే బయలుదేరాడు.

డాక్టరుగారి ఇంటిదగ్గర ఆటో దిగలేని తనను చెయ్యి పట్టుకుని క్రిందకు దింపిన ఆటో డ్రైవరు ముఖంలో చిరాకు, తనని చూడగానే తారస్థాయినుండి మంద్రానికి వచ్చింది.

మీవాళ్ళు ఎవ్వరూ లేరా?

సమాధానం చెప్పలేకపోయాడు. "నాకు అందరూ వున్నారు, నేనే ఎవ్వరికి ఏమీకాను' అని ఎల్లా చెబుతాడు.

ఆ స్థితిలో ఒంటరిగా వచ్చినందుకు డాక్టరుగారు సహస్రనామాలతో ప్రారంభించి ఆయన పరిస్థితి గ్రహించి అష్టోత్తరంతో పూర్తిచేశాడు. ఇంట్లో వాళ్ళు అంతా ఏమైయ్యారు అని అడిగాడు. ఎప్పుడూ చెప్పే సమాధానం ఈనాడు కూడా చిరునవ్వుగా చెబుదామనుకున్నాడు.

"అంతా కులాసాగా ఉన్నారు" కాని ఇవ్వాళ చిరునవ్వుకూడా బాధగానే వుంది, గుండె రంపంతో కోస్తున్నట్లుగా వుంది.

"వద్దు....ఇప్పుడు తేలికగానే వుంది...పిల్లలు, మా ఇల్లాలు కంగారు పడతారు....నేను ఆటోలో వెళ్ళిపోతాను" ఒక చిన్న సహాయం చెయ్యండి.

మీరు ఆటోలో వెళ్ళడానికి వీలులేదు. మన అంబులెన్సులో తీసుకువెళ్ళి ఇంటిదగ్గర దింపివస్తా. మీరు క్షేమంగా ఉండటం అందరికి చాలా అవసరం.

పరంధామయ్య ఏమీ మాట్లాడలేదు. కారులో ఎక్కికూర్చున్నాడు.

ఇంటిలో అందరూ అడిగిన ప్రశ్న-

ఒంట్లో బాగాలేదని మాతో ఎందుకు చెప్పలేదు....విసవసా మీ అంతట మీరు ఒంటరిగా వెళ్ళడమేనా, మేము వెళ్ళి డాక్టరుగారిని పిలుచుకునివచ్చేవారం కదా!

ఆయన ఏమీ సమాధానం చెప్పలేదు. చిరునవ్వు నవ్వాడు. ఈసారి గుండె కలుక్కుమనలేదు.

మీ నాన్నగారికి చాలా విశ్రాంతి అవసరం - మంచి గాలి, మంచి ఆహారం కావాలి. వేళకు మందులు వాడాలి. ఏదైనా పల్లెటూరులో వుంటే మంచిది.

అందరూ అదే మంచిది అన్నారు. ఈ ఒక్కవిషయంలో అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు.

చకచకా ఏర్పాట్లు చేశారు.

వానప్రస్థానికి బయలుదేరే రోజు వచ్చింది.

"ప్రొద్దు ఎక్కకుండా స్నానం సంధ్య పూర్తిచేసుకోండి మీ ఆరోగ్యానికి మంచిది" పెద్దకోడలు సలహా.

"డాక్టరుగారు చెప్పిన మందులు తప్పక వాడండి" అని సుపుత్రుడు హెచ్చరిక.

"మామయ్యగారికి ప్రొద్దున్నే టిఫిను చేసిపెట్టండి. ఆయన టిఫిను తిని మందు వేసుకోవాలి. అభోజనంగా వేసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి" అని చిన్న కోడలు అత్తగారికి పదేపదే గుర్తుచేసింది.

'తాతయ్యా అక్కడికి వెళ్ళగానే మంచి కలర్ టీవీ కొనుక్కోండి' అని మనుమడి సలహా.

తాతగారిని, బామ్మగారిని కౌగలించుకుని మనుమరాలు గద్గద కంఠంతో అడిగింది.

"మీరు మళ్ళీ ఎప్పుడు వస్తారు"

ఆ దంపతుల ముఖంలో వెయ్యి హరివిల్లులు ఒక్కసారి వెల్లివిరిసాయి.

ఆ చిన్నదాని కన్నీరు తుడుస్తూ-తాతగారు అన్నమాట.

నీ పెళ్ళికి వస్తాం.

దూరంగా గుడిలో గంటలు మ్రోగాయి.

కారు కదిలింది.